# లై డి టెక్టర్

## 1

దూర్వాస రామానంద దగ్గర, కొన్ని అపూర్వమైన వస్తువులూ, ప్రాచీన గ్రంథాలు ఉన్నాయి, రామానంద శతాయుష్మాన్ కాబోతున్నాడు, యెంతా యింక మూడేళ్ళంతే, నూరవ జన్మదినం జరుపుకుంటాడు, ఒంట్లో బాగా వోపిక తగ్గిపోయింది, కళ్ళూ చెవులూ బాగానే పని చెస్తున్నాయి, అరుగుదల ఉన్నది, దంతాలు ఊడిపోయాయి, అయినా జీర్ణకోశం బాగానే పని చేస్తున్నది గనక తినగలవన్నీ తినేస్తాడు, పని చేసుకోలేడు.

రక్త సంబంధీకులంతా పెద్దవాళ్లై పోయారు, కొంతమంది చేసీ చేసీ విసుగెత్తి వదిలేసి వెళ్ళిపోయారు, యెవరన్నా వచ్చి దయగలిగి భక్తితో సేవచేసి వండి తినిపించి, ఆహ్లాదకరంగా మాట్లాడితే సంతోషించి, విలువైనదీ అపూర్వమైనదీ యిస్తాడు. వారు వెళ్ళిపోతుంటే నిజంగానే దుఃఖిస్తాడు, ఉండరని తెలిసినా ఉండమని అడుగుతాడు.

□ □ □

రెండేళ్ళ క్రితం దూరపు బంధువు శిరీష వచ్చింది, కని పెట్టి వుండి అన్ని పనులూ చేస్తు, భోజనం తయారుచేసి తిని పిస్తు, కథలూ, కబుర్లూ చెబుతూ, జానపద నృత్యం చేసి చూపిస్తు మెప్పిస్తున్నది, కూరలు పండిస్తుంది, వాటిని కోసి రుచిగా మెత్తగా వండుతుంది, పెండలం దుంపలిస్తారు గ్రామీణులూ, పల్లెకారులూ, వాటిని కాల్చి తొక్కతీసి కలకండ కలిపి పళ్ళెంలో వుంచి తినమని యిస్తుంది, దంపుడు బియ్యపన్నం

మెత్తగా తీయగా పొడి పొడిగా వుండేట్టు వండి అరటాకులో వడ్డిస్తుంది. రకరకాల ఒరుగులూ, పచ్చడులూ ఘుమఘుమ లాడుతూ నోరూరించే సాంబారూ కలిపి దానితో ఒరుగులు తిన మంటుంది.

పూవులను దండలుగా గుచ్చి నగలలాగా ధరిస్తుంది, తీయగా గానం చేస్తుంది, నాలుగోతరం మనమరాలౌతుంది. తల్లిదండ్రుల మీదా, కాబోయే వరునిమీదా అలిగి వచ్చింది, దాని కథ అడగలేదు రామానంద, కాని మాటల సందర్భంలో రక్తసంబంధం యెక్కువేనని అర్థమైంది, రాతి ముగ్గు తెచ్చి ఆశ్రమం ముందు రంగవల్లితీర్చి చుట్టూ తిరుగుతూ తట్టుతుంది.

గొబ్బియళ్లో! సఖియా వినవే! చిన్ని కృష్ణుని సోదరి వినవే! కృష్ణుని చరితము గానారే.

సభలోకి ద్రౌపదినీ తెచ్చీ, దుశ్శాసనుడవమానింపంగా, అక్షయమిచ్చీ బ్రోచేనే॥

గేయం పాడుతూ అభినయిస్తుంది.

ఓబులేశుని కొండల నడుమా, వొంచె గడ్డీ కోసేదానా, ఒంచె గుడ్డా ఒల్లె గుడ్డేమే, హరి ఓబులేశా।

కాళింది కిజకిజి చణక చణకని।
నన్ను చూసీ నవ్వబోకోయీ॥

గిద్దెల గిరీ కొండల నడుమా। యెద్దుల గాసే ముద్దుల మరిదీ। దాపటెద్దుకు దప్పికాయేనోయ్। హరి ఓబులేశా॥

కాళింది కిజికిజి చణకచణకని। నన్ను జూసీ నవ్వబోకోయీ॥

కట్టమీదా పొయ్యేదానా॥ కాలుకురచా చిన్నెదానా।
కమ్మలిస్తా వస్తవంట్రోసీ। హరి ఓబులేశా।
కమ్మల్లాకూ నమ్మజాల్లానోయ్॥
గోటురై కా చిన్నదానా। గోటుమీదా పూలు పొయ్యావే॥
పదం పాడుతూ నాట్యమాడుతుంది శిరీష.
కంటికీ కాటుకెట్టీ కడవా చంకాన బెట్టీ
కంటినీరే కడవ నింపితే గదరా।
చల్। మోహనరంగా। నీకు నాకూ జోడు కుదిరెను గదరా॥
నీకూ నీవారు లేరూ। నాకూ నావారు లేరూ।
యేటిమీదా తేలిపోద్దాం పదరా। చల్। మోహనరంగా.
కొయ్యోడివదం పాడుతూ ఆడుతుంది.
బాలడ్స్ వచ్చు శిరీషకి.
వాణీదేవి మదిని దల్తు। వరదరాజు వర్ణిస్తు।
చారుమతిని దలతు సప్త సాగరమ్ముల్నా।
కంచి వరదరాజులో మించి కీర్తి స్తుత్యాల యనగ।
యనగ ఒక్క వేడ్క మించిపాడెదా.

అంత సముద్రాని వట్టి అంచగ్రమున షెర్గిందేవి। మగువ పెరగుచుండెత నా మందిరమ్మునా॥

పారిజాతాపహరణం, మోహినీ రుక్మాంగద, మార్కండేయ చరితం, వెన్నెల రోజుల్లో వినిపిస్తుండగా, రోజులు నిమిషాలల్లే గడిచిపోయాయి. ఇక వెళ్తానంది శిరీష.

ఆహారమెంత రుచో, మాట అంత ఆనందమిస్తుంది.

వెళ్తానంటే దుఃఖించి, యింకొక్క యేడుండలేవూ? అనడిగాడు దుర్వాస రామానంద.

దేనికీ? అనడిగిందర్థంగాక.

సెంచరీ పూర్తవుతుంది అన్నాడు నవ్వుతూ.

శిరీషా నవ్వింది, నువ్వు నూట యిరవై యేళ్ళుంటావు దాదా. నా చికాకంతా తగ్గిపోయింది, చాలా ప్రేమ చూపుతూ నాతో కాలక్షేపం చేశావు, థాంక్స్, నేనుపోయి నగరంలో వది లేసి వచ్చిన నా చదువు పూర్తి చేసుకోవాలి, పోతా, నీ జ్ఞాప కార్థం యేమైనా యిస్తావా? అన్నది.

నువ్వు నాకు జ్ఞాపకానికి వస్తూనే ఉంటావు శిరీషా, నిన్ను మరువలేను, యేమి కావాలో అడుగు, ఇవ్వగలనేమో చూస్తా, తాళపత్ర గ్రంథం కావాలా, పుస్తకం కావాలా? విశిష్ట మైన చిన్న వస్తువు కావాలా? యంత్రం కావాలా? అన్నాడు తల నిమురుతూ.

అపూర్వమైన చిన్న యంత్రమియ్యి. నాకు చాలా యేళ్ళనించీ నిజం చెబుతున్నారా, అబద్ధం చెబుతున్నారా తెలుసుకునే యంత్రమొకటుంటే బాగుండును అనిపించేది, నాది విలువైన దంతపు పమిట పిన్ను పోయింది. నువ్వు తీశావు' అని యింటివారబ్బాయినంటే, 'నేను తీయలే'దని దబాయించాడు, అక్కడ మరెవ్వరూ లేరు. అతనొక్కడే యేదో చదువుతూ కూచుని ఉన్నాడు, పిన్ను వదిలి యింట్లోకి పోయి వచ్చేప్పటికి పోయింది, నాకు అనుమానం మిగిలింది.

అటువంటి యంత్రమా? అదేమంత అపూర్వమైనది కాదు. నువ్వడిగేది లై డిటెక్టర్ తెచ్చిస్తా వుండు అని లేచి

ఆశ్రమం లోపలికెళ్ళి చిన్న వస్తువు తెచ్చి శిరీషకిచ్చాడు, అది యంత్రం.

ఇది అబద్ధమాడుతున్నారా? సత్యం చెబుతున్నారా చెబుతుందంతే, మరోటి ఉండేది, అదింకా వివరాలు చెప్పేది, అబద్ధమాడేవారి ఐడియా చెప్పేది, దానినెవరో యెత్తుకు పోయారు, నాకు శక్తిలేక యేమీ చేయలేక ఊరుకున్నాను అన్నాడు దూర్వాస రామానంద.

ఇది చాలు దాదా! థాంక్స్! గుడ్ బై అని పాదాలు తాకి వెళ్ళిపోయింది శిరీష. వాడటం చెప్పే కాగితం యంత్రం వెనకే ఉన్నది, అదీ చూశాడు దాదా.

పిచ్చి పిల్ల! అనుకున్నాడు.

యెదుటివారు చెప్పే అబద్ధాలు, నిజాలని నమ్ముతున్నట్టు కనిపిస్తే, చెప్పేవారికీ, వినేవారికీ గూడా ఆనందం కలుగుతుంది, ద్వేషముండదు. అబద్ధమాడే వ్యక్తికీ, వినే వ్యక్తికీ గూడా అవి అబద్ధాలని తెలుసు. అబద్ధమాడేవారి అంతరాత్మే చెపుతుంది, అబద్ధమాడుతున్నావు అని వినే వ్యక్తికి కామన్ సెన్సు చెపుతుంది, అబద్ధాలు వింటున్నావు అని అనుకున్నాడు రామానంద.

## 2

శిరీష యెమ్మెస్సీ పూర్తిచేస్తున్నది. కాలేజీనించి యింటికి వస్తున్నది. వెనకనించి 'శిరీషా' అని తీయని గొంతు వినిపించింది.

శిరీష నిలబడి వెనక్కు తిరిగింది.

పూర్ణ పరుగెత్తుకొచ్చాడు. యెక్కడి కెళ్ళావు? రెండేళ్లు ఐపులేవు. చెప్పకుండా వెళ్లావేం. యెక్కడున్నావు? బియస్సి చాలు పెళ్లి చేసుకుందామంటినే, నరేవంటివే, మోసగించి, మాటతప్పి, మాయమైనావే ? అన్నాడు.

బస్‌స్టాప్ వద్దకువచ్చి నిలబడ్డారు.

నువ్వన్నవన్నీ అబద్ధాలని ఋజువు చేయనా? అదుగో కన్యకాపరమేశ్వరిగుడి. ఆగుళ్లోకి పోదాంరా, అన్నది శిరీష.

' పోనీ యిప్పుడైనా ఒప్పుకో. నాకు ఆరులక్షలు కట్న మిచ్చి, జాబ్ చేస్తున్న అమ్మాయినిస్తామని వస్తున్నారు. మా అమ్మ తొందర పడుతున్నది. ' అన్నాడు చక్కగా నవ్వుతూ.

నువ్వు మీఅమ్మ సెలక్టు చేసినమ్మాయిని చేసుకో నేను ఆరులక్షలు కాదుగదా ఆరునికెల్సుగూడా యివ్వలేను. ఇవ్వను మనిద్దరికీ క్షేమం కలుగుతుంది. అని నిర్మలంగా చూసింది.

విచారిస్తావు సుమా. అయినా అబద్ధాలంటావేం? నువ్వే బద్ధమాడటన లేదూ. అన్నాడు తీవ్రంగా

లేదు. రా గుళ్లోకిపోయి. పరమేశ్వరి దర్శనం చేసుకు వద్దాము అక్కడ మనిద్దరిలో యెవరబద్ధమాడేదీ ఋజువుచేస్తాను, అని దారితీసింది శిరీష.

పూర్ణాకి వినోదం కలిగింది. యెట్లాచూస్తుందో! అనుకుంటూ శిరీష ననుసరించాడు.

అమ్మవారి దర్శనం చేసుకుని, తీర్థప్రసాదాలు తీసుకుని మంటపంలోకి, వచ్చారిద్దరూ, మెట్లమీదకూచున్నారు.

'చూడు' అని శిరీష తర్జనితో రాతిస్తంభం వేపు చూపించింది. నీరెండ స్తంభంమీద పడింది. బొగ్గుతో రాసినట్టు నల్లని అక్షరాలు కనిపించాయి.

నువ్వే మొదట ప్రపోజ్ చేశావు పూర్ణా! తర్వాతనువ్వే మీఅమ్మ ఒప్పుకోటంలేదనీ అభ్యంతరం చెప్తున్నదనీ అన్నావు. బాగా నొప్పిస్తూ. మీకెవరికీ మంచిపేరులేదుట, డబ్బూలేదుట. మీఅమ్మ ప్రతీయింట్లో ఛిత్రం తెచ్చిపెడుతుందిట. విడిపోతారుట. అదీ మీఅమ్మ అబ్జెక్షన్. మనసు వికలమై స్వాధీనంగాక శిరీష వెళ్లిపోయింది.

పూర్ణా వెలవెల పోయాడు. నీదగ్గరేదైనా లైడిటెక్టరున్నదా? కొనుక్కున్నావా? యెవరైనాయిచ్చారా? అన్నాడు

ఇచ్చారు. అన్నది.

యెవరు?

దూర్వాపరామానంద అనే తాతగారు ఇన్నాళ్ళూ ఆయన దగ్గరే వున్నాను. ఆయనే నావికలత్వం తగ్గించేశాడు. వచ్చేశాను. అన్నది నిశ్చలంగా.

పూర్ణా మొహం తెల్లగా పాలిపోయింది. లేచి గబగబా మెట్లుదిగి, అంగలువేస్తూ గుడి ఆవరణదాటి వెళ్ళిపోయాడు.

3

అలాగా శిరీష తననెవరైనా డబాయించినా, నొవ్వనాడినా, లొంగదీయాలని చూసినా లైడిటెక్టర్ సాయంతో నిజం చూపించి వదిలించుకునేది

ప్రపంచం కొంచెం కొంచెం అర్థం కాసాగింది. కాని ప్రమాదో ధీమతామపి. అని లై డిటెక్టర్ వాడకపోవటంవల్ల ప్రమాదంలో యిరుక్కున్నది.

ఆరెరె! లై డిటెక్టర్ని పూజించుకోటం, వాడుకోటం ఆపేశానే. పొరపాటు జరిగిపోయింది. అలసత్వం యేర్పడింది అహం పెరిగిందేమో, శౌరి చెప్పినమాటలు నిజమనినమ్మి మోస పోయాను. అని చింతించింది.

జాబ్ మానేయలేక, అవమానాలు భరించలేక కాలం భారంగా నెట్టుతున్నది. విచారం తగ్గించుకుని, యంత్రంవెతికి దులిపి శుభ్రంచేసి పూజించింది శిరీష. మళ్లాధైర్యమొచ్చింది.

యెత్తిపొడుపుమాటలూ, యీసడింపులూ, హేళనాభరించ లేక నెలలు నిండుతున్న శిరీష తిరగబడింది.

మీరంతా అబద్ధాలాడుతున్నారని ఋజువుచేస్తాను. అదిగో సినిమా గోడమీద చిత్రం చూడండి. అని నేలమీద కూచుని గోడవేపు చూపించింది.

రాత్రి తొమ్మిది గంటలు. దీపాలు పోయినై, కానిగోడ మీద తెల్లని వెల్తురుపడి చిత్రం నడుస్తున్నది. చూశారు.

శౌరి అనే అందమైన ఆఫీసర్ వస్తూపోతూ వుండేవాడు ఇంట్లో అందరితో స్నేహంగా, మంచిగా వుండటం, పన్లుచేసి పెట్టటం, అప్పులుయివ్వటం సాగించాడు. శౌరిరాగానేయింట్లో అందరి మొహాలూ వికసించేవి. శిరీషను కలుసుకుంటున్నాడని తెలిసిపోయి, చేతికి చిక్కంగానే నిలదీశారు.

నాకు పెళ్ళిలో నమ్మకంలేదు. పరిస్థితులనుకూలంగా లేవు కొన్ని యిబ్బందులున్నాయి. అందుకని చేసుకోను. కాని శిరీషను దగాచేయను. దగామనిషిలాగా కనబడుతున్నానా? మీకు నేనేమీ చేసిపెట్టటంలేదా? అని నోరుమూయించాడు.

## 4

శిరీష జ్ఞానేవకాసం క్షమాశక్తౌ అన్న సూక్తిననుసరించి క్లిష్టపరిస్థితి దాటగలిగింది మాష్టర్‌డిగ్రీ అందిందిగాని రిసెర్చ్ చేసే అవకాశం లేదు. చిన్నబిడ్డను చూడాలి. పార్ట్‌టైమ్ జాబ్ అందితే అందుకున్నది.

శౌరిపూల్ ఆఫీసరుగా అమెరికా వెళ్ళాడు. చల్లగా బంధువులు జారిపోయారు. అవారోగాన్ని లెక్కచేయక, బిడ్డను శిశువిహార్లో వుంచి డబ్బుకట్టి, జీతం కళ్ళచూసేది శిరీష. ఈ ఒంటరితనంలో యంత్రం శుభ్రం చేయటం పూజించటం వాడటం, అశ్రద్ధచేసింది. పెద్దగా అవసరమూ రాలేదు. కాని ఆ యంత్రం యింట్లో వున్నందువల్లనో యేమో, అయస్కాంతం పనిచేసినట్టు, వుద్యోగం ముగిసి, శౌరి తిరిగివచ్చి శిరీషనూ బిడ్డనూ తీసికెళ్లాడు. పాతవుద్యోగం అట్లాగే వున్నది. ఆ వుద్యోగమిచ్చిన ఇంట్లో వున్నారు శిరీషా శౌరి.

విశ్రాంతి ననుభవిస్తు శౌరి సాహచర్యం యెంజాయ్ చేస్తుండగా, యిరువాగుల ఆత్మబంధువులూ వచ్చి తమ హక్కును వాడుకుంటూ మెల్లిగా చనవెక్కువచేసి నొప్పించసాగారు. శౌరికి తన అత్తవారు రావటం బొత్తిగా యిష్టం లేదు. శిరీషలాగా వారు పొదువరులూ గాదు, నభ్యతా లేదు, కల్చరూ

లేదు, పల్లెటూరి గబ్బిలాలల్లే కనిపించారు. మీ వాళ్ళను రావద్దను అని శిరీషతో చెప్పలేక, హాస్యం ద్వారా తన ఉద్దేశం చెప్పాడు శౌరి.

ఆడపిల్ల లేంచేస్తారంటే, వాళ్ళ వాళ్ళు రాగానే, జేబులో ఉన్నవీ, పెట్టెలో ఉన్నదీ తీసి చాటుగా అందిస్తారు అని అభినయించాడు.

మగపిల్లలేం చేస్తారంటే, వాళ్ళవాళ్ళు రాగానే, అప్పు తెచ్చి అయినా సరే కనకాభిషేకం చేస్తారు. తన స్త్రీ వారిని దెవ్వుతుందేమోనని, క్రీగంట చూస్తు భద్రతలు తీసుకుంటారు. బెల్లం కొట్టిన రాయిలాగా ఉండాలి తన స్త్రీ అని తానూ నవ్వుతాలుకే అన్నది శిరీష.

అంతటితో అయిపోలేదు వారిద్దరి కలహం.

మీ వాళ్ళు నేను తమకి గూడా మొగుడిని అనుకుంటున్నారు, అన్నీ మొగుడే చేయాలిట, చౌరవగా నా బెడ్ వాడుకుంటున్నారు అని టీజ్ చేస్తున్నాడు శౌరి.

బీప్ బీప్ అనే శబ్దం వినిపించింది.

శిరీష నవ్వింది.

యేమిటా శబ్దం? అనడిగాడు శౌరి.

బల్లి శకునం, బల్లి అరుస్తున్నది.

యేమంటున్నది బల్లి?

మీరు అబద్ధమాడుతున్నారంటున్నది.

శౌరికి బాగా కోపమొచ్చింది, కాని నవ్వులో దాస్తు నిగ్రహంతో అన్నాడు.

నాదేం పోయింది? నేను కథలల్లి చెప్పటం లేదు, నువ్వు కళ్ళారా చూసినప్పుడే నమ్ము, కాని నాదే తప్పంటే ఊరుకోను అని వెళ్ళిపోయాడు.

యెందుకైనా మంచిదని శిరీష దుమ్ము పేరుకున్న యంత్రం తీసి శుభ్రం చేసి మెరుపు తెప్పించింది.

ఆనాడాదివారం, పిల్లవాడికి నీళ్ళుపోసి తుడిచి పౌడరద్ది, మంచి గుడ్డలేసి స్టాండు ఉయ్యాల్లో వుంచుతున్నది, ఉయ్యాలలో ఉండనంటాడు, ఉయ్యాల పట్టుకు నిలబడతాడు.

కింద బడతావు అని పడుకోబెడుతుంది, మళ్ళా నవ్వుతూ లేచి నిలబడతాడు.

అరవింద అనే బంధువు వచ్చింది. పిల్లవాడితో ఆడింది. శిరీషను చూసి నవ్వింది. నేను గూడా వీడికి జతగా యిలాటి పిల్లవాడిని కనబోతున్నా శిరీషా, శౌరి నాకూ వరసే, నీ గర్వం అణిచేస్తా, ఇంతకంటె అందంగా ఉండబోతున్నాడు నా బిడ్డ. నేను ఉద్యోగం చేయక్కర్లా, కట్టుకుపోయేంత యిచ్చి పోయాడు చచ్చిన మొగుడు, యేం చేసుకుంటానదంతా. నీకు వంట రాదు అధ్వాన్నంగా ఉంటుందట నీ వంట, అన్నీ టైమ్ చూస్తు చేస్తావుట, ఉడికిందా లేదా గూడా చూడవుట, నిద్ర లేచింది మొదలుకొనీ పరుగే, మొగుడికూనడా అందవు అని అంటూ ఉయ్యాల ఊపుతున్నది.

శిరీష గుండె దడదడా కొట్టుకున్నది. ఈమె ఆయనతో మరీ చనవుగా తిరిగిందేమో, మగవాడి మనస్సు పాదరసం

లాగా పతుగెత్తుతుంది అనుకుని యంత్రమున్న గదిలోకి వెళ్ళింది.

యంత్రం మెల్లిగా బీప్ బీప్ అన్నది.

## 5

మొదటి కొడుకును నర్సరీలో చేర్పింది శిరీష, రెండో కొడుక్కి పుట్టినరోజు పండగ చేసి, వేడుకచేసి, కొద్దిమందిని కొలీగ్స్‌ని పిలిచి పార్టీ యిచ్చింది శిరీష. ప్రెజెంట్సుతో ఉయ్యాల నిండిపోయింది. బిడ్డను ముద్దులాడుతూ నెత్తిన పూలరేకులు పోస్తున్నారు. వచ్చీ రాని మాటలూ వచ్చీ రాని నడకా, అందరి దగ్గరకీ కొత్తలేకుండా పోతున్నాడు.

శిరీషా చిన్నప్పుడు కాన్వెంట్‌లో చదువుతుండగా గిటార్ నేర్చారు నువ్వూ గోమతీ, అదిప్పుడు లెక్చరర్‌గా పని చేస్తున్నది. ఇప్పుడూ అంత బాగా వాయిస్తున్నావని చెప్పింది. సూపర్ మార్కెట్లో చూశాను దాన్ని, వినిపించవూ చాలా దూరం నించి ఆటోలో వచ్చాము, చాలా తిండి తినిపించావే, ఇప్పుడే యింటికి పోలేము. సాటి ఉద్యోగిని కోమలవల్లి నవ్వుతూ అడుగుతున్నది.

ఆ. ఆ. వినిపిస్తా అని గిటార్ తేవటానికి బెడ్‌రూమ్‌లోకి పోయింది శిరీష, తలుపులు మూసన్నా లేవు, కర్టెన్ కదులుతున్నది గానికి, కర్టెన్ పక్కకి నెట్టి లోపలికెళ్ళింది, అరవిందా శౌరీ బెడ్‌మీదున్నారు, అరవింద బ్లౌజ్ గుండీలు ఊడినై. చీర అస్తవ్యస్తంగా ఉన్నది. శౌరి మనోహరంగా ఉండ నవ్వుతున్నాడు.

అల్మర తీసి గిటార్ అందుకుని వెళ్ళిపోయింది శిరీష.

తనను చూచి వాళ్ళిద్దరూ బెడ్‌మీది నించి లేవనన్నా లేవలేదు సరిగదా అసలు మనిషి వచ్చినట్టు గమనించనే లేదు.

## 6

మళ్ళా నెల గడిచింది, ఇద్దరూ ఫార్మల్‌గా పలకరించు కుంటారు శౌరి శిరీషా.

ఆ రోజున పొద్దుటినించీ నవ్వుతూ పలకరిస్తు సరసాలాడు తున్నాడు శౌరి. యేమిటి విశేషం? అనుకున్నది.

నిలబడి నవ్వుతూ అన్నాడు.

మా వాళ్ళొస్తున్నారు నువ్వెదురెళ్ళి నవ్వుతూ పలకరించి ఆహ్వానించాలి, అది సభ్యత.

మీరు అరవిందకు చనవిచ్చి నెత్తి నెక్కించుకోటం సభ్యతా, వరసేట మీ యిద్దరికీ, అరవిందే చెప్పింది, ఆమె సభ్యత పాటించను అని ప్రతిజ్ఞ చేసిందేమో, మీరు చేయలేదను కుంటా, మీకు లోకం పోకడ తెలియదా? మీరు విదేశం వెళ్ళి నప్పుడూ, నేను అనారోగ్యంగా ఉన్నప్పుడూ అంతా జారు కున్నారు. మీ ఉద్యోగం ఒక పెద్ద ఆకర్షణ, మీ కండబలం, వంటిరంగూ చూస్తే అరవిందకు మతిపోయిందేమో! అన్నది.

నేను ముందే నీకు నాజూగ్గా చెప్పాను, నీకర్థం కాలేదు, నాదేం పోయిందీ, నేను నా బెడ్‌మీదికి రమ్మని ఆహ్వానించ లేదే, మరీ మంచిదనుకున్నా, ఒకరికిద్దరుంటారు, అది పెడ మొహం పెడితే యిదీ, యిది పెడమొహం పెడితే అదీ అందు

తారని చూశా, నాకు లాభం గదూ, నీకు ఉద్యోగమున్నదీ, ఆమెకు ఆస్తి ఉన్నది, అలా హాస్యమాడుతూ, పరాచికమాడుతూ హాలంతా తిరుగుతూ కిటికీవేపు వెళ్ళాడు శౌరి, కొద్దిసేపు వీధి వేపు చూశాడు, మళ్లా వచ్చాడు, వోసారి యెదురుగా నిలబడీ, మరోసారి వీపు చూపుతూ హాలంతా తిరుగుతున్నాడు, మళ్లా వచ్చాడు.

మా వాళ్ళకు నువ్వు నచ్చావు, పొరపాటు జరిగిపోయింది మనిషి విలువ తెలుసుకోలేకపోయాము అని విచారిస్తున్నారు, ముఖ్యంగా మా అన్నాయికి నువ్వు నచ్చావు, ఇల్లు మానేజ్ చేసుకుంటూ, జాబ్ చేసుకుంటూ పిల్లల్ని యెంత చక్కగా పెంచుతున్నదీ? అని విస్తుపోయాడు, మా వదినకు నిన్ను చూపి, అలా ఉండాలి భార్యా అంటే అని, నీ అలవాట్లు ఆమెకు చేయాలని, నిన్ను తనతో తీసికెళ్తానని ఉత్తరం వ్రాశాడు: మా అమ్మేమో,

అన్నాయి పిల్లలు బొత్తిగా చెప్పిన మాట వినటం లేదు, వాళ్ళమ్మేమో, పూజలూ వ్రతాలతో పుణ్యం సంపాయించు కుంటూ పిల్లలేమౌతున్నారో చూచుకోటం లేదు, అన్నాయి పిల్లల్ని తెచ్చి నీ దగ్గరుంచుతాము, శిరీష చక్కగా శ్రద్ధగా పెంచుతుంది, చదువుతున్నారా లేదా చూస్తుంది, ఆమె చదువు కున్నది అని వ్రాయించింది.

అందుకే వాళ్ళు వస్తున్నారు, మా చెల్లికి జాకెట్లు కుట్టి యియ్య, టైలరు పాడు చేస్తున్నాడుట, మా తమ్ముడేమో సిటీ చూడాలని వస్తున్నాడు, టాక్సీలో తీసికెళ్ళి ఊరంతా తిప్పి,

మ్యూజియం, పార్క్, బీచ్, జూ, యూనివర్సిటీ అన్ని చూపాల్సి ఉంటుంది, పిల్లల్ని కసిరి కొట్టకు, జాగర్త, పాత విషయాలెత్తి దెప్పకు, అయిందేదో అయిపోయింది, గతం నాస్తి అనుకుని మనం మనం ఒకటి అనుకోవాలి, మాది సమిష్టి కుటుంబం అని యింకా దండకం చదువుతున్నాడు శౌరి.

శిరీష చెవులు ఘడియలు పడినై, మొహం పారిపోయింది, యంత్రం కోసం చూస్తు, యేమిటీ అఫీసరు అంతర్యం? అనుకున్నది, కాని యంత్రం మౌనంగా ఉండిపోయింది.

## 7

మళ్ళా గవర్నమెంట్ పంపగా అరువారాలు శౌరి యూరప్ పర్యటనకు వెళ్ళాడు, ఫ్రెండ్స్ వచ్చి రెండు రోజులున్నారు, నాల్రోజులుంచుకుని తెచ్చి అప్పగిస్తామని పిల్లలిద్దర్ని తీసికెళ్లారు.

శిరీష మనస్సు వికలమై గిలగిలా కొట్టుకున్నది, వచ్చి వెళ్ళిన బాంధవుల అసభ్య ప్రవర్తనా, దుడుకుతనం, దురుసు మాటలూ, గేలి చేయటం గుర్తు వచ్చి యెవరూ లేరు గదా అని తనివితీరా యేడ్చింది, గుండెలు తేలికైనై, మొహం కడుక్కున్నది, యంత్రం గుర్తు వచ్చింది, దాదా రామానంద గుర్తు వచ్చాడు.

రెండో యంత్రముండేదన్నాడే, అదేం చెప్పేదో, అడక్కపోతినే, లై డిటెక్టర్ పూరికే నిజానిజాలు చెప్తుంది, వారి అంతర్యమేమిటో చెప్పదు, దాదానడిగి అటువంటి యంత్రం

మరొకటున్నదేమో తెచ్చుకోవాలి అనుకున్నది, పనిమనిషి రాగానే చెప్పింది. మా తాతను చూసి వచ్చేస్తాను.

పబ్లిక్ హాలిడే మరునాడాదివారం కలిసివచ్చాయి.

తీరా వెళ్తే దాదా లేడు, ఆశ్రమం ఖాళీ.

ఆ చుట్టు పక్కలున్నవాళ్ళు శిరీషను చూసి వచ్చారు.

దాదా! నిన్ననే పోయినాడు తల్లీ! నిన్ననే రాకపోయినావా? చూపులందేవి, నిన్ను తలుచుకుంటూనే, నీ మాటలు చెప్తూనే ఉన్నాడు, తనను తగలేస్తే చాలు, ఇంకేమీ చేయక్కర్లేదని గట్టిగా చెప్పినాడు, మాకందరికీ తలా ఒక శాలువా దుప్పటీ యిచ్చినాడు, నీవు వస్తే లోపలికి తీసికెళ్ళమన్నాడు అని చెప్తుండగా శిరీష స్పృహ తప్పి పడిపోయింది.

నీళ్ళు మొహాన చల్లి, విసిరి ఉపచారం చేశారు, కొద్ది సేపటికి లేచింది.

లోపలికెళ్లాలనుందా? అనడిగారు.

అవునని తలూపింది.

తీసికెళ్ళి, తలుపులు గొళ్ళెం తీసి తలుపులు నెట్టారు.

నువ్వు చూస్తు ఉండు, మేము మళ్లా వస్తాము అని శిరీషను వదిలి వెళ్ళిపోయారు.

ఒక వెదురు మంచం తప్పితే యింకేమీ లేవు, పాత్రిలూ లేవు, వదార్థాలూ లేవు, ఆ మంచం మీద కూచుని చేతుల్లో మొహం దాచుకున్నది శిరీష, తాను దాదాతో గడిపిన దినాలు సినిమా రీళ్ళలాగా తిరిగాయి.

□ □ □

మెల్లిగా లేచి చూసింది, ఒక గూడు కన్పించింది. అందులో చిన్న పుస్తకం అది తీసింది, పుటలూ యెక్కువ లేవు, ఉన్న పది పుటలూ తిప్పింది.

శిరీషా! కన్నతల్లి! మళ్లా వచ్చావా? అంతర్యం చెప్పే యంత్రం కావాలని వచ్చావా? అమాయకురాలా? పిచ్చిపిల్లా! లోకాన్ని పుస్తకం చదివినట్టు చదివితే, అనుభవం వలన యెదుటివారి మనస్సులో యేమున్నదీ తెలిసిపోతుంది. దానికి యంత్రం కావాలా, మన అంతరాత్మ యంత్రం, అదన్నీ చెపుతుంది, వినిపించుకోవాలి, యేమన్నా సందేహం కలగగానే అంతరాత్మను అడగాలి, ఆవేశం వలన యేమీ అవగాహన కాదు, రోజూ కొంతసేపు అంతర్ముఖురాలవై ధ్యానించు, ఆత్మ అన్నీ చెపుతుంది, నా కోసం విచారించకు. ప్రపంచాన్ని ద్వేషించకు, ప్రేమించు, ఈశ్వరుని లీలలు చూసి ఆనందించాలి కష్టసుఖాలు అందరికీ సమానమే.

ఆశీస్సులతో
దాదా రామానంద.

అది చదివి పుస్తకం మూసి గుండెలకానించుకున్నది, శిరీష బైటికొచ్చింది.

ఇందాకటివారొచ్చారు.

వెళ్దా మన్నది.

అయిపోయిందీ, అన్నీ చూశావా? పద బస్సెక్కిస్తాము అని కూడా వచ్చారు.

□ □ □